# 11. పులగం, నెయ్యి

**నేపథ్యం:** నవ్వడమే ఒక భోగం – నవ్వకపోవడమే ఒక రోగం' అన్నారు హాస్యబ్రహ్మ జంధ్యాల. నవ్వడం ఎంతో ఆరోగ్యకరం అన్నది శాస్త్రీయంగా కూడా రుజువైన విషయం. అందుకే ఏ సాహిత్యంలోనైనా హాస్యానికి చాలా ప్రాధాన్యత ఉంది. కింది కథను చదివి కడుపారా నవ్వండి – ఇతరులకు చెప్పి నవ్వించండి.

ఒక వూల్లో యిద్దరు బార్యాబర్తలుండేటోల్లు. ఆల్లు యెవసాయం జేశేటోల్లు. బర్తకు పులగం అంటే శానా యిష్టం రోజు వెట్టినా తినేటోడు. బార్యకేమొ నెయ్యంటే పానం గమ్మత్తుకి బర్త బార్యని పులగం అని పిల్శేటోడు. "పులగం! తానానికి నీల్లుదోడు, పులగం! అన్నం బెట్టు, పులగం పసులకు కుడ్తి దాపు" అనేటోడు. యిగ బార్యేమొ బర్తని. "నెయ్యి" అని పిల్శేది. "నెయ్యీ! అన్నం దింటావా? నెయ్యీ సద్ది గట్టమంటావా?, నెయ్యీ! పాలు పిండినవా?" అనేటిది. అట్లనే ఆల్ల యెద్దుని! సుట్టం అని, బర్రెని "కట్టె" అని పిల్సుకునేటోల్లు.

యిదిట్లుండంగ ఒగనాడు బర్త బాయికాడ పొలం దున్నుకుంటువున్నడు. పక్కూరినించి ఆల్ల సుట్ట మొకాయన ఆల్లని జూశిపోదామని వొచ్చిండు. అప్పుడు బర్త ఆయనని మంచిశెడ్డలడిగినంక "నేను యింక కూసింతశేపు దున్నినంక వొస్త! యింటి కాడ పులగంవుంది. నువ్వు వొయ్యి బోంచెయ్!" అన్నడు. అది యినంగనే సుట్టం యింటికి వోతే పులగం దినొచ్చన్నమాట అన్కొని సంతోషంగా ఆల్లయింటికి వొయ్యిండు.

సుట్టాన్ని జూశి బార్య చానా సంతోషపడ్డది. "అన్నా! యిప్పుడే దింటావా నెయ్యి వొచ్చిందాక ఆగుతావా! అనడిగింది. దానికి సుట్టం పులగంల నెయ్యేస్కొని తింటె శాన కమ్మ గుంటది గద అన్కొని "యిప్పుడొద్దులే శెల్లె! నెయ్యొచ్చిందాక ఆగుత!" అన్నడు.

జెరశేపయినంక పొలం కాన్నించి బర్త యెద్దుని దోల్కొని వొచ్చాడు "యిద్గో! సుట్టాన్ని దీస్కొని పొయ్యి దొడ్లో గట్టెయ్యిపో అన్నాడు బార్యతోటి.



**సొంతవాక్యాల్లో ఉపయోగించండి:–** ● నెయ్యి ● సంతోషం ● మంచిచెడ్డలు ● కమ్మగా ● వ్యవసాయం.

అందుకామె "సుట్టాన్ని గట్టేస్తా గాని పొద్దట్నుంచి కట్టె గనవడ్తలేదు. యేడుందో దేవులాడకరాపో!" అన్నది.

ఆ మాటలు వొచ్చిన సుట్టం శెవినవడ్డయ్. అసలు సంగతి దెల్వని ఆయన "యీల్లు నన్ను దొడ్లో గట్టేశి కట్టెతోటి గొట్టాలను కుంటున్నరన్న మాట! గబక్కన యీడ్నుంచి బైట వడాల! అన్కోని దొడ్డి తలుపుగుండా ఎనక్కి దిరిగి సూడకుండా ఉరికిండు. సుట్టపాయన యెందుకు ఎల్లేడో అర్థంగాక మొగుడుపెళ్ళాలు బుర్రగోకున్నారు.

**I. వినండి–చెప్పండి.**

1. ఇంట్లో మీ అమ్మ, నాన్న మిమ్మల్ని ఏమని పిలుస్తారు?
2. సాధారణంగా కుక్కలు, పిల్లులకు ఎలాంటి ముద్దు పేర్లు ఉంటాయి?

**II. పదజాలం పెంపొందించుకుందాం.**

**అర్థాలు:**

వూల్లో = ఊళ్ళో; యెవసాయం = వ్యవసాయం;
పానం = ఇష్టం; తానానికి = స్నానానికి;
కుడ్తి = బియ్యం మొదలగు వాటిని కడిగిన నీరు;
సుట్టం = బంధువు; జెరసేపు = కొద్ది సేపటికి;
కమ్మగా = రుచిగా; శెల్లె = చెల్లీ;
పొద్దుగాలట్నించి = ఉదయం నుండి;
దేవులాడుట = వెదకుట;
శెవిల వడ్డయ్ = వినపడ్డాయి; జెల్ది = వెంటనే;
యీడికెల్లి = ఇచ్చటనుండి;
ఉరికిండు = పరుగెత్తెను.

**III. చదవండి–చెప్పండి–రాయండి**

**అ. సరియైన సమాధానానికి వలయం 'o' చుట్టండి.**

1. భార్యకు ఇదంటే పానం.
   (అ) నెయ్యి (ఆ) కూర
   (ఇ) పప్పు (ఈ) పాయసం
2. బార్యబర్తలు యెద్దును ఇలా పిలిచేవారు.
   (అ) బంధువు (ఆ) సుట్టం
   (ఇ) మిత్రమా (ఈ) వృషభమా
3. సుట్టం ఇంటికిపోతే దీనిని తినవచ్చని సంతోషపడ్డాడు.
   (అ) అన్నం (ఆ) భోజనం
   (ఇ) పులగం (ఈ) రొట్టె

**ఆ. ఖాళీలు పూరించండి**

1. బార్యా బర్తలు బర్రెని ________ అని పిల్సుకునేటోల్లు.
2. సుట్టాన్ని జూశి బార్య ________ సంతోషపడ్డది.
3. నేను యింక ________ దున్నినంక వొస్త.
4. పొలం కాన్నించి బర్త ________ ని దోల్కోని వచ్చిండు.

**ఇ. పాఠం చదివి కింది వాక్యాలు తప్పు/ఒప్పులుగా గుర్తించి రాయండి.**

1. బార్యకేమొ పులగమంటే పానం. ( )
2. ఆల్ల ఎద్దుని సుట్టం అని పిల్సుకొనేటోల్లు. ( )
3. బార్య ఎద్దుని దోల్కొని వొచ్చింది. ( )
4. ఆ మాటలు వొచ్చిన సుట్టం శెవిలవడ్డయ్. ( )
5. నన్ను దోడ్లె గట్టేశి కట్టె తోటి గొట్టాలనుకుంటున్న రన్న మాట. ( )

**IV. భాషావగాహన**

**అ. గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో రాయండి.**

1. పులగం తానానికి నీల్లుతోడు.
2. సుట్టాన్ని జూశి బార్య మస్తు సంతోషపడ్డది.

ఆ. వచనాలు మార్చి రాయండి.

1. బర్రెలు 2. పొలం

3. చుట్టం 4. కట్టెలు

ఇ. వాక్యాంగాలను రాయండి.

1. బర్త పొలందున్నకుంటు వున్నడు.

2. సుట్టం పులగం తినాలనుకున్నాడు.

**V. సృజనాత్మకత:–**

అ. ప్రవాహకృతిని పూర్తి చేయండి.

సుట్టం పులగం తినొచ్చని వెళ్ళాడు → [ ] → [ ]

సుట్టం వెనక దర్వాజల కెళ్ళి మర్లి ఉరికిండు ← [ ] ← [ ]

ఆ. కథలోని పాత్రలకు పెట్టుకున్న పేర్లు రాయండి.

| బార్య | బర్త | యెద్దు | బర్రె |
|---|---|---|---|
| ↓ | ↓ | ↓ | ↓ |
| పులగం | | | |

ఇ. తారుమారైన పదాలను సరిచేసి రాయండి.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఉదా: సంపా | → | పాసం | పంతోసం | → | | ట్టంసు | → |
| గంలపు | → | | ద్దుఎ | → | | జర్వాద | → |

**భాష–చమత్కారం:**

**ఒకే పదం వేర్వేరు అర్థాలు:**

చేయి : ఇది నా **చేయి**

చేయి : నీవు ఈ పని **చేయి**

వాడు : **వాడు** ఇంటికి వెళ్ళాడు.

వాడు : నేను గుడ్డ సంచినే **వాడు**తాను

కట్టు : పిల్లవానికి చీమ **కుట్టింది**

కుట్టు : అమ్మ చెల్లి కోసం గౌను **కుట్టింది**

కాలు : వేడిగా ఉంది జాగ్రత్త!

**కాలు** **కాలు**తుంది

బట్టలు శుభ్రంగా **ఉతికారు**

దొంగని పట్టుకొని బాగా **ఉతికారు.**

**నేనివి నేర్చుకున్నా.**

- మనస్ఫూర్తిగా నవ్వడం ఆరోగ్యకరం. • ఇది శాస్త్రీయ సత్యం.
- ఇతరులను కించపరచని హాస్యం ఉత్తమమైనది.